సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 16 । మే । 2024



పదవీ గండం
జడ్చర్ల పుర చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కౌన్సిలర్లు రంగం సిద్ధంచేశారు.

వివరాలు 8లో ▸



రాష్ట్రంలో రాక్షస పాలన
రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.9 /23.1

ఉదయం వేళ ఎండ తీవ్రత కాస్త తక్కువగా ఉన్నా.. మధ్యాహ్నం పెరుగుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటినుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి సెమిస్టర్ 2, 4, 6 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పీయూ పరిధిలో 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా.. 2వ సెమిస్టర్‌లో 25,575 మంది, 4వ సెమిస్టర్‌లో 16,902 మంది, 6వ సెమిస్టర్‌లో 13,751 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయడంతో పాటు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేసినట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని.. నిర్ణీత సమయంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించాలి



అడ్డాకుల: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ ఆదేశించారు. బుధవారం మండలంలోని కందూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వంద శాతం పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామాల్లో ఓపీని పెంచాలని తెలిపారు. ప్రతి ఆశావర్కర్ 10 మందిని తీసుకొచ్చి వైద్యసేవలు పొందే విధంగా పనిచేయాలని చెప్పారు. అనంతరం అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ వెంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నరేష్ చంద్ర, డా.ప్రవళిక, ఎంపీహెచ్‌ఈఓ సుభాష్‌చంద్ర, సీహెచ్‌ఓ భాస్కర్, ఏఎన్‌ఎం గౌరి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
మహబూబ్‌నగర్ న్యూటౌన్: గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ద్వారా అందించే నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి చత్రునాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందని పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోగా http://overseas.tribal.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పథంలో డీసీసీబీ



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): అందరి సహకారంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి పథంలో పయనిస్తోందని డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ కోరమోని వెంకటయ్య అన్నారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగుల సమిష్టి కృషితో 2023–24 ఆర్థిక సంవత్సరం రూ. 12 కోట్ల నికర ఆదాయాన్ని సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో డీసీసీబీ ద్వారా వెహికిల్ లోన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులకు రూ. 1,054 కోట్ల స్వల్పకాలిక రుణాలు అందించడంతో పాటు బంగారం ఆభరణాలపై రూ. 150 కోట్ల రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. గత సంవత్సరం రూ. 339 కోట్లు మాత్రమే ఉన్న డిపాజిట్లు.. ఈ సంవత్సరం రూ. 372 కోట్లకు చేరుకున్నాయని చెప్పారు. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు 91 మంది విద్యార్థులకు రూ. 12.46 కోట్ల విద్యా రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. అంతేగాక గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల నిర్మించుకోవాలనుకున్న 188 మంది రైతు కుటుంబాలకు గృహ రుణాలు కూడా అందించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 78 ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు, 22 బ్యాంకులు, 360 వ్యవసాయేతర సంఘాలు పనిచేస్తున్నాయని ఆయన వెల్లడించారు. కొత్తగా ప్రవేశపెట్టిన కర్షక మిత్ర పథకంతో రైతులకు మరింత మేలు చేకూరనుందని, ప్రతి రైతుకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్. భూపాల్‌రావు, రంగారెడ్డి, నర్సింహారెడ్డి, బక్కన్నయాదవ్, లక్ష్మీనారాయణ, చంద్రానాయక్, నర్సింహులు ఉన్నారు.

సీఎం వ్యూహం ఫలించేనా..!

'పాలమూరు' లోక్‌సభ ఫలితాలపై ఉత్కంఠ

- హస్తం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా 11సార్లు పర్యటించిన రేవంత్
- సెంటిమెంట్‌తో పాటు ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు
- పోలింగ్ సరళిపై పార్టీలో భిన్నాభిప్రాయాలతో నిశిత పరిశీలన
- క్రాస్ ఓటింగ్‌పై వేగుల ద్వారా సమాచార సేకరణ
- అసెంబ్లీ సెగ్మెంట్లలో మండలాలు, గ్రామాలు, బూత్‌ల వారీగా లెక్కలు
- అనుకూల, ప్రతికూల అంశాలపై ఆరా.. నియోజకవర్గ ముఖ్యనేతల పని తీరుపైనా..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులోని రెండు పార్లమెంట్ స్థానాల్లో నువ్వా..నేనా అన్నట్లు సాగిన ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు పోస్టుమార్టం మొదలుపెట్టాయి. గెలుపుపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ధీమా వ్యక్తం చేస్తున్నా.. పోలింగ్ సరళి బెంబేలెత్తిస్తోంది. క్రాస్ ఓటింగ్‌తో పాటు సైలెంట్ ఓటింగ్ కొనసాగిన క్రమంలో ఇది ఎవరికి మేలు చేస్తుంది.. ఎవరికి నష్టం చేస్తుందనే దానిపై ఎవరికి వారు లెక్కలేసుకుంటున్నారు. ప్రధానంగా మహబూబ్‌నగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు కొనసాగినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య సైలెంట్‌గా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితం ఏ విధంగా ఉంటుందనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ తన వేగులను నేరుగా రంగంలోకి దింపినట్లు ప్రచారం జరుగుతోంది. క్రాస్ ఓటింగ్‌పై వారి నుంచి క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడమే కాకుండా.. అనుకూల, ప్రతికూల అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ముఖ్యనేతల పనితీరుపైనా..

కొడంగల్ నియోజకవర్గంలో 50వేల మెజార్టీ ఇవ్వాలని సభావేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేసిన రేవంత్‌రెడ్డి.. ఆ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో పోలింగ్‌కు నాలుగైదు రోజుల ముందు హైదరాబాద్‌లో సమావేశమై అనుసరించాల్సి వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అయితే పోలింగ్ అనంతరం కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు, కోస్గి, దౌల్తాబాద్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సైలెంట్‌గా క్రాస్ ఓటింగ్ సాగినట్లు ప్రచారం చోటుచేసుకుంది. దీనిపై పార్టీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాగా.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మండలాలు, గ్రామాలు, బూత్‌ల వారీగా నిశితంగా పరిశీలించి ఎక్కడెక్కడ క్రాస్ ఓటింగ్ జరిగింది? అక్కడ కాంగ్రెస్ నాయకులు ఎందుకు పసిగట్టలేకపోయారు? వారు ప్రజల మధ్య తిరిగారా.. లేదా? వంటి వివరాలతో సమగ్ర నివేదిక అందజేయాలని వేగులను ఆదేశించినట్లు సమాచారం. అనుకూల, ప్రతికూల అంశాలతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్య నేతల పనితీరుపైనా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసినట్లు వినికిడి. ఈ బాధ్యతను తనకు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్న ఒకరికి అప్పగించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



క్రాస్ ఓటింగ్‌పై క్షేత్రస్థాయిలో ఆరా..

సీఎం రేవంత్ సొంత ఇలాకా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కావడంతో ఇక్కడ కాంగ్రెస్ గెలుపును ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా 11 పర్యాయాలు స్వయంగా పర్యటించారు. ఇందులో ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా పదిసార్లు వచ్చారు. ఇంటగెలిచి రచ్చ గెలవాలని... మీ బిడ్డను ఆశీర్వదించాలని.. పాలమూరు సమగ్రాభివృద్ధికి నేనే బాధ్యత తీసుకుంటానని సెంటిమెంట్ అస్త్రం ప్రయోగించడంతో పాటు కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఎందుకివ్వలేదని, బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనంటూ విమర్శలు గుప్పించారు. అంతేకాదు.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండగా.. వారినుద్దేశించి చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పోలింగ్ తీరుతెన్నులపై నానారకాల అనుమానాలు వ్యక్తం కావడంతో ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన బాధ్యతలను తన వేగులకు అప్పగించినట్లు తెలుస్తోంది.

బూత్ ఇన్‌చార్జీల బెంబేలు..

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్‌ల వారీగా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రతి బూత్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించారు. బూత్ పరిధిలో ప్రచారం తీరుతెన్నులతో పాటు రోజురోజుకూ చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలించి పార్టీలోని ముఖ్యుల దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ప్రస్తుతం బూత్‌ల వారీగా వేగులు ఆరా తీస్తున్న క్రమంలో బూత్ ఇన్‌చార్జిలు బెంబేలెత్తుతున్నారు. అంతుచిక్కని ఓటరు నాడీతో ఏం చెప్పాలనే దానిపై వారిలో ఆందోళన నెలకొంది. ఏదేమైనా తమదే గెలుపు అని బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా.. అదేరోజు అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఆ తర్వాత జిల్లాలో రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పీయూ భవనాల పనుల్లో వేగం పెంచాలి




పీయూలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మల్లయ్యభట్టు

- రాష్ట్ర ఐడబ్ల్యూఐడీసీ, సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్యభట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో చేపట్టిన భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ఐడబ్ల్యూఐడీసీ డైరెక్టర్, సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్యభట్టు ఆదేశించారు. బుధవారం పీయూలో జిల్లా ఈడబ్ల్యూఐడీసీ, విద్యాశాఖ, పీయూ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పీయూలో చేపట్టిన భవనాల నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అగ్రిమెంట్ ప్రకారం భవనాలను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాల్సిందేనని తెలిపారు. భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులకు ఎటువంటి ఇబ్బందులు లేవని.. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. యూనివర్సిటీ అధికారులు న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారని.. త్వరలో అందుకు సంబంధించిన ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో భవనాల పనులను పూర్తిచేసి, పీయూ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. ప్రతిపాదనలపై సమీక్ష చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని.. నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని టీటీగుట్ట పాఠశాలలో చేపట్టిన 'మనబస్తీ – మనబడి' పనులను పరిశీలించారు. మూత్రశాలలు, తరగతి గదుల నిర్మాణంతో పాటు గతంలో కాంట్రాక్టర్లు నిర్మించకుండా వదిలేసిన వాటిని కలెక్టర్ అనుమతితో అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంలోకి మార్చాలని డీఈఓ రవీందర్‌కు సూచించారు.

■ పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు నిధుల విషయంలో సహకారం అందిస్తున్నామని.. సకాలంలో భవనాలు పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ పరంగానూ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. భవనాల పనులను సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ అనిల్, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ తదితరులు ఉన్నారు.



జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు

తాగునీటి అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసింది. వేసవి ఎండలకు నెర్రెలుబారిన కృష్ణానది ఎగువ నుంచి వస్తున్న నీటితో నిండుకుంటూ నెమ్మదిగా జూరాల జలాశయానికి చేరుకుంటోంది. బుధవారం ప్రాజెక్టు వెనుక ప్రాంతమైన ఈర్లదిన్నె ముంపు ప్రాంతంలో కృష్ణమ్మ పరుగులిడుతూ ఇలా కనిపించింది. - అమరచింత

క్వింటా ఉల్లి రూ. 2,600



దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లిగడ్డ

దేవరకద్ర/జడ్చర్ల: కొన్ని రోజుల కిందటి వరకు రూ. వెయ్యి నుంచి రూ. 1,500 వరకు ఉన్న ఉల్లి ధరలు.. రెండు వారాల నుంచి పైపైకి ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం దిగుబడులు తగ్గి, సీజన్ ముగుస్తున్న క్రమంలో ఉల్లి ధరలు రెండింతలు పెరిగాయి. దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. వ్యాపారులు వేలం లేకుండానే నేరుగా కొనుగోలు చేశారు. క్వింటా ఉల్లి గరిష్ఠంగా రూ. 2,600, కనిష్ఠంగా రూ. 2,200 ధర పలికింది. తూకం చేసిన ఉల్లిని అప్పటికప్పుడు 45 కేజీల బస్తాల్లో నింపి, రూ. 1,300 నుంచి రూ. 1,100 వరకు విక్రయాలు సాగించారు. ఇక చిన్నపేడు ఉల్లి బస్తాలను రూ. 600 నుంచి రూ. 500 వరకు విక్రయించారు. కాగా, కొందరు రైతులు ట్రాక్టర్లపై ఉల్లి బస్తాలను పెట్టుకొని అమ్ముకున్నారు. నాణ్యమైన ఉల్లి బస్తా ధర రూ. 1,300 నుంచి రూ. 1,100 వరకు అమ్మకాలు సాగించారు.

రూ. 2,319 పలికిన సోనామసూరి ధాన్యం

దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ. 2,319, కనిష్ఠంగా రూ. 2,062 ధర పలికింది. మార్కెట్‌కు 300 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

వేరుశనగ రూ.5,920..

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ క్వింటా గరిష్ఠంగా రూ. 5,920, కనిష్ఠంగా రూ. 4,710 ధరలు పలికాయి. కందులు రూ. 9,800, జొన్నలు రూ. 4,677, మొక్కజొన్న గరిష్ఠంగా రూ. 2,274, కనిష్ఠంగా రూ. 2,039, ఆముదాలు గరిష్ఠంగా రూ. 5,546, కనిష్ఠంగా రూ. 5,380, రాగులు రూ. 2,902, ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం గరిష్ఠంగా రూ. 2,420, కనిష్ఠంగా రూ. 1,901, హంసధాన్యం రూ. 1,969 ధరలు వచ్చాయి.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ **జి.రవినాయక్ ఆదేశించారు. బుధవారం** కలెక్టరే**ట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా**డుతూ పట్టణాలు, గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సాఫీగా ముగియడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ క్రతువులో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎన్నికల కౌంటింగ్‌ను సైతం విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల భవనాల్లో బయట, లోపల అంతటా శుభ్రపరచాలన్నారు.

ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ

కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రవాణాతో పాటు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలు చేపట్టాలన్నారు. ధరణి పోర్టల్ ద్వారా వివిధ మాడ్యూల్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి'కి వచ్చిన ఫిర్యాదులను ఈ–ఆఫీసులో 15 రోజులకు మించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. బ్లాక్, లీనియర్ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు నీరు పోసి సంరక్షించాలన్నారు. ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయించాలని సూచించారు. ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ ద్వారా సిబ్బంది హాజరును సంబంధిత అధికారులు సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ అడ్మిషన్లు షురూ..

- ఈ నెల 29 వరకు దరఖాస్తుకు గడువు
- వలు ప్రభుత్వ కళాశాలల్లో కొత్త కోర్సులకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- ఎంవీఎస్ కాలేజీలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు
- పీయూ పరిధిలో 92 కళాశాలలు.. 31,090 సీట్ల భర్తీకి అనుమతి



ఎంవీఎస్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకుగాను ప్రభుత్వం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ (దోస్త్) ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతోంది. ఈ మేరకు ఈనెల 6 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. దరఖాస్తుదారులు మొదటి దశ వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు ఈ నెల 20 నుంచి జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 92 డిగ్రీ కళాశాలలు ఉండగా.. 31,090 సీట్ల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దరఖాస్తుల అనంతరం మొదటి దశ సీట్ల అలాట్‌మెంట్ జూన్ 6వ తేదీన చేపట్టనున్నారు. దరఖాస్తు చేసుకునే క్రమంలో విద్యార్థుల సందేహాలను తీర్చేందుకుగాను మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటుచేశారు.

కొత్త కోర్సులు...

పీయూ పరిధిలో సుమారు 31 వేల సీట్ల భర్తీకి ప్రతి సంవత్సరం ప్రభుత్వం అనుమతి ఇస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదు. గత సంవత్సరం 50 శాతం కూడా సీట్లు భర్తీ కాలేదు. ఈక్రమంలో సీట్ల భర్తీని పెంచేందుకుగాను ప్రభుత్వం వృత్తి ఆధారిత కోర్సులను తీసుకువచ్చింది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ ఎంవీఎస్, ఎన్టీఆర్ కళాశాలలతో పాటు జడ్చర్లలోని బీఆర్‌ఆర్ కళాశాలల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీఏ (హెచ్‌ఈపీ) స్పెషల్ కోర్సులో జర్నలిజం, అంతర్జాతీయ రాజకీయాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా సిలబస్‌లో మార్పులు తెచ్చారు. ఇక బీఎస్సీలో ఫార్మారంగంలో సేల్స్, మార్కెటింగ్‌లో సులభంగా ఉద్యోగాలు పొందేవిధంగా కొత్త కోర్సు ఉంది. బీకాం విభాగంలో ఫైనాన్స్ కోర్సు తీసుకువచ్చారు. బీబీఏలో రీటెయిల్ ఆపరేషన్ వంటి కోర్సులు ఉన్నాయి. వీటిలో వారానికి మూడు రోజుల పాటు విద్యాబోధన, మూడు రోజులు ఇంటర్న్‌షిప్ ఉండనుంది.

జాగ్రత్తలు పాటించాలి..

దోస్త్ అడ్మిషన్ తీసుకునే క్రమంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మీసేవ కేంద్రాల నిర్వాహకులపై పూర్తిగా ఆధారపడవద్దు. ఆప్షన్ ఇచ్చుకునే కళాశాల, కోర్సుల విషయంలో అవగాహన ఉండాలి. విద్యార్థి తన ఫోన్ నంబర్‌ను మాత్రమే ఎంటర్‌చేసే విధంగా చూసుకోవాలి. కొత్త కోర్సులను ఉపాధి ఆధారితంగా ఉండేవిధంగా ప్రభుత్వం రూపొందించింది.

– మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్, పాలమూరు యూనివర్సిటీ

డిజిటల్ విద్యకు ప్రోత్సాహం



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దివ్యాంగ విద్యార్థులు డిజిటల్ విద్యలో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూ పీజీ కళాశాల, పీజీ సెంటర్‌లో చదువుతున్న 12 మంది దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి, అన్ని అంశాలను తెలుసుకోవడానికి ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్కో ట్యాబ్‌కు రూ. 16 వేల చొప్పున రూ. 3.50 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం..

పాలమూరు యూనివర్సిటీలో ఉన్న లైబ్రరీని ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చేందుకు జెనిసిస్ టెక్ సిస్టం సంస్థతో అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈమేరకు డిజిటల్ లైబ్రరీ కార్యక్రమాన్ని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ బటన్ నొక్కి ప్రారంభించారు. పీయూ లైబ్రరీలోని పుస్తకాలు ఏ ర్యాక్‌లో ఉన్నాయి.. ఎన్ని ఉన్నాయి.. విద్యార్థుల సబ్జెక్టు పుస్తకాలు ఉన్నాయా.. లేదా అనే అంశాలను ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు కలగనుంది. కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, లైబ్రరీ కోఆర్డినేటర్ అనురాధ, బషీర్ అహ్మద్, అంకం భాస్కర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు పాలమూరు వైద్యురాలు

పాలమూరు: కొరియా దేశంలోని భూసాన్ నగరంలో ఈనెల 16నుంచి 20వ తేదీ వరకు ఏషియా, ఓషియానా ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఇండియా నుంచి ముగ్గురు వైద్యులు ఎంపికైనట్లు స్థానిక సుశ్రుత ప్రజావైద్యశాల డాక్టర్ ప్రతిభ చెప్పారు. సుశ్రుత ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సదస్సుకు ఎంపికైన ముగ్గురు వైద్యులలో ఒకరు ఢిల్లీ, మరొకరు ముంబాయికి చెందిన వారు కాగా.. తెలంగాణ నుంచి తాను ఎంపిక అయినట్లు తెలిపారు. మహిళల్లో ఉబ్బకాయం.. మెడిసిన్ పాత్ర అనే అంశంపై ఈనెల 18న తాను ఉపన్యాసం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జీవన విధానంలో మార్పులతో ఎలాంటి మందులు లేకుండా వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం
- పగిడ్యాల్‌లో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

- వివరాలు 9లో..



క్లుప్తంగా

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

● ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో మిన్నంటిన రోదనలు


మద్దెల రిషి కుమార్ (ఫైల్)

మన్ననూర్: తోటి స్నేహితులతో కలిసి ఈత కోసం వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతి చెందిన ఘటన అమ్రాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పదర మండల కేంద్రానికి చెందిన మద్దెల రవికుమార్ కుమారుడు మద్దెల రిషికుమార్ (13) అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి ఉత్తీర్ణుడై వచ్చే విద్యా సంవత్సరం 8వ తరగతి చదవాల్సి ఉంది. తన అమ్మమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసేందుకు బుధవారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమీపంలోని వ్యవసాయ పొలంలోని నీటి కొలనుకు తోటి స్నేహితులతో కలిసి ఈత కోసం వెళ్లారు. లోతైన కొలనులో ఈత కొడుతున్న క్రమంలో అలసిపోయి రిషి కుమార్ మునిగిపోయాడని తోటి స్నేహితుల ద్వారా తెలిసింది. ఎంతకు కనిపించకపోవడంతో గ్రామంలోకి వెళ్లి విషయం బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు హుటాహుటిన కొలను వద్దకు వెళ్లి రిషికుమార్‌ను వెలికి తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఇదిలా ఉండగా మృతుడు తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. వేసవిశిక్షణలో భాగంగా కొన్ని రోజులుగా అచ్చంపేట పట్టణంలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాడు. తన అమ్మమ్మను చూసి వెళ్లేందుకు గ్రామానికి వచ్చి అకాల మృతి చెందాడంటూ పలువురు కంటతడి పెట్టుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నవాబుపేట: మండలంలోని తీగలపల్లికి చెందిన శివకుమార్(24) ఈ నెల 12వ తేదీన రుద్రారంకు తన మిత్రుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా సిద్దోటం సమీపంలో కిందపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో శివకుమార్‌ను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఢిఎస్ఐ అభిషేక్ రెడ్డి తెలిపారు. మృతుని తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్ఐ వివరించారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు..

గద్వాల క్రైం: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపిన కథనం మేరకు.. వీరాపురం చెందిన చిన్న బీచుపల్లి (42) మంగళవారం ఉదయం బ్యాంకు పని నిమిత్తం పూడురుకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇటిక్యాలకు చెందిన లక్ష్మణ్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో పూడురు శివారులో రెండు బైక్‌లు ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చిన్న బీచుపల్లికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

యువకుడు అదృశ్యం: కేసు నమోదు


ఆంజనేయులు

బల్మూర్: మండలంలోని కొండనాగులకు చెందిన యువకుడు అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. గ్రామానికి చెందిన తూర్పాటి సైదమ్మ కుమారుడు ఆంజనేయులు మూడేళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయి ఉన్నట్లు తెలిపారు. ఈనెల 12న తాను కూలీ పనికి వెళ్లగా ఇంట్లో నుంచి వెళ్లిన కుమారుడు తిరిగి రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతి కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్ఐ స్వాతి బుధవారం తెలిపారు. ఎర్రవల్లి మండలంలోని ఆర్.గార్లపాడుకు చెందిన కుర్వ సుబ్బయ్య (42) ఈ నెల 13 నుంచి అదృశ్యమయ్యాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో అనుమానస్పదంగా చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలిక మృతిపై కేసు నమోదు

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన ద్యాగ భాగ్యలక్ష్మి (16) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఈనెల 11న తల్లి మందలించడంతో ఇంట్లో పురుగు మందు తాగడంతో చికిత్స నిమిత్తం అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రులకు వెళ్లగా బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 13న మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ ఘటనపై రాజకీయపరమైన ఒత్తిళ్లతో మృతి చెందిన బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి బాలిక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుర చైర్‌పర్సన్‌కు పదవీ గండం



● అవిశ్వాసానికి సిద్ధమైన జడ్చర్ల బీఆర్ఎస్ కౌన్సిలర్లు
● రెండు రోజుల్లో కలెక్టర్‌కు ప్రతిపాదన నోటీసు అందజేసే అవకాశం

జడ్చర్ల: బీఆర్ఎస్‌కు చెందిన జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మికి పదవీ గండం నెలకొంది. సొంత పార్టీ కౌన్సిలర్లే ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో పలువురు కౌన్సిలర్లు సమావేశమై అవిశ్వాస విషయంపై చర్చలు జరిపారు. అయితే ఒక్క చైర్‌పర్సన్‌పైనే కాకుండా వైస్ చైర్‌పర్సన్ సారికపై కూడా అవిశ్వాసం ప్రతిపాదించాలని కొందరు సభ్యులు తమ అభిప్రాయం వెల్లడించారు. దీన్ని వైస్ చైర్‌పర్సన్ భర్త రామ్మోహన్ తీవ్రంగా వ్యతిరేకించారు. వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ఎందుకు పెడతారని ప్రశ్నించారు. దీనిపై పలువురు సమాధానమిస్తూ.. మున్సిపాలిటీలో కీలకమైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల్లో మహిళలు ఉండి నామమాత్రంగా ప్రోటోకాల్‌కే పరిమితమయ్యే పరిస్థితి ఉందన్నారు. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం కావడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారంలో జాప్యం కలుగుతుందన్నారు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని కొందరు కౌన్సిలర్లు పేర్కొన్నారు. వైస్ చైర్‌పర్సన్ స్థానంలో మహిళ కాకుండా పురుష సభ్యుడు ఉంటే పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే ఏకకాలంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సహేతుకం కాదని.. మొదటగా చైర్‌పర్సన్‌పై మాత్రమే అవిశ్వాసం పెట్టి, నూతన చైర్‌పర్సన్‌ను ఎన్నుకున్న తర్వాత వైస్ చైర్‌పర్సన్‌ను మారుద్దామా.. వద్దా అని ఆలోచిద్దామని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇద్దరిపై ఒకేసారి అవిశ్వాసం ప్రతిపాదిస్తే, సభ్యులు చీలిపోయి అవిశ్వాసం వీగిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధం కావడం గమనార్హం. మున్సిలిటీలో మొత్తం 27 వార్డులకుగాను 23 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారు ఉండగా.. ఇటీవల ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం జరిగిన సమావేశానికి 20 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. అవిశ్వాస తీర్మాన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సభ్యులంతా ఏకాభిప్రాయానికి వచ్చాక, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుందామని లక్ష్మారెడ్డి కౌన్సిలర్లకు సూచించారు.

రెండురోజుల్లో ప్రతిపాదన నోటీసు

మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిత నోటీసును కలెక్టర్‌కు అందజేయాలని సభ్యులు తీర్మానించారు. అయితే గురు, శుక్రవారాల్లో నోటీసు ఇవ్వాలని కొందరు సభ్యులు ప్రతిపాదించారు. కాగా, రెండు, మూడు రోజుల్లో మరోసారి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, కలెక్టర్‌కు ప్రతిపాదిత నోటీసు ఇవ్వనున్నట్లు కొందరు సభ్యులు తెలిపారు.

ఇదీ కారణం..

మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి కేవలం అలంకారప్రాయంగా పదవికి పరిమితం కావడం.. ఆమె భర్త రవీందర్ పాలనలో అన్నీ తానై సభ్యులను సమన్వయం చేసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతో వ్యతిరేకత వచ్చిందని చెప్పవచ్చు. అంతేగాక అవినీతి, అక్రమాల ఆరోపణలు రావడం.. పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉండటం.. సొంత వ్యాపారాలకు పరిమితం కావడంతో పాటు అసెంబ్లీ ఎన్నికలలో ఓటమికి ప్రధాన కారణంగా కూడా భావిస్తున్నారు. వీటితో పాటు పందులను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారని.. ప్లాట్లు తదితర భూ కబ్జాలకు పాల్పడుతున్నారంటూ ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రస్తావిస్తున్న నేపథ్యంలో అవినీతి మరకలను తొలగించుకోవడానికి అవిశ్వాస తీర్మానమే సరైన మార్గంగా బీఆర్ఎస్ భావిస్తోంది. మెజార్టీగా అవిశ్వాసానికి సై అంటుండటంతో త్వరలోనే సభ్యులు ఏకపక్షంగా నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

రాష్ట్రంలో రాక్షస పాలన


అచ్చంపేటలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు తదితరులు

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం అచ్చంపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని, వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు వెనకేసుకురావడం సరైంది కాదన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అచ్చంపేట ప్రాంతంలో నయీం ముఠా ఆనవాళ్లు కనిపిస్తున్నాయని.. పోలీసుల వ్యవహార శైలిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులపై దాడులు అధికమయ్యాయని.. సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతిపక్షాల ఫిర్యాదులను పోలీసులు స్వీకరించడం లేదని.. ఎఫ్ఆర్ఐలు నమోదు చేయడం లేదని ఆరోపించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే దాడులు అధికమయ్యాయని.. అచ్చంపేట బీఆర్ఎస్ కౌన్సిలర్ నిర్మల ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, స్థానిక నాయకుల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అంతకుముందు గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆయన అనుచరులు మాఫియాగా ఏర్పడి దాడులకు పాల్పడుతున్నారని.. కాంగ్రెస్ గుండాల దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేస్తే సహించం..

నాగర్‌కర్నూల్ క్రైం: దళితులు, బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాములలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులపై దాడులకు పాల్పడిన వారిని పోలీసులు ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై పట్టపగలే దాడులకు పాల్పడినా పోలీసులు వీడియోలు తీయడం వరకు మాత్రమే పరిమితమయ్యారని.. దాడిచేసిన వారిని పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఎస్సీ కమిషన్‌తో పాటు మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

అప్పుడే భారమయ్యానా?


ఆస్పత్రిలో శిశువు ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యులు

రెండు నెలల శిశువును జిల్లా ఆస్పత్రిలో వదిలేసిన వైనం

గద్వాల అర్బన్: నవమాసాలు మోసి పురిటి నొప్పులతో ఓ బాబును జన్మనిచ్చిన తల్లి పేగు బంధాన్ని తెంచుకుంది. ఈ లోకంలోకి వచ్చి నీ ప్రేమను పొందాలనుకున్నాను. తొమ్మిది నెలలు ఎంతో అపురూపంగా చూసుకున్నావు కదా.. రెండు నెలలకే నీకు భారమైయ్యానా!? ఎందుకు నన్ను ఆస్పత్రిలో వదిలేశావ్.. నీ పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన నేను.. ఇలా మంచంపై ఒంటరిగా ఉన్నాను. కారణాలేమైనా.. తప్పు ఎవరిదైనా ఏ పాపం తెలియని రెండు నెలల మగ శిశువును జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వదిలేసి వెళ్లిన ఘటన చర్చనీయాంశమైంది. తల్లి ఒడిలో సేద తీరాల్సిన ఆ శిశువు మంచంపై ఒంటరిగా గుక్కపెట్టి ఏడుస్తూ కనిపించిన ఘటన కలచివేసింది. ఏడుపు విన్న అక్కడే ఉన్న రోగులు ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి గుర్తు తెలియని మహిళలు ఆస్పత్రిలో వదిలేసి వెళ్లినట్లు బాలల పరిరక్షణ సిబ్బందికి తెలియజేశారు. డీడబ్ల్యూఓ సుధారాణి వివరాలు వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లల వార్డు పక్కనే ఎవరూ లేని మరోక వార్డులోని మంచంపై మగ శిశువును బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. అయితే ఆ శిశువు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబీకులు ఆ శిశువు ఏడుపు విన్నారు. ఆ వార్డులోకి వెళ్లి చూడగా.. రెండు నెలల నవజాత శిశువు మంచంపై కనిపించాడు. విషయం వైద్య సిబ్బందికి తెలియజేశారు. వైద్య సిబ్బంది అక్కడి చేరుకుని డీడబ్ల్యూఓకి విషయం తెలిపారు. డీసీపీఓ నర్సింహ, సిబ్బంది ఆస్పత్రి వద్దకు చేరుకొని శిశువును పరిశీలించారు. వైద్యుడు శ్యాంబాబు పరిశీలించి జ్వరం, దగ్గు ఉన్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం కూడా వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు కొనసాగించారు. గురువారం శిశువును మహబూబ్‌నగర్‌లోని శిశుగృహకు తరలించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

ఈ ఘటనపై డిడబ్ల్యూఓ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో సీసీ కెమెరాలను పరిశీలించారు. బుధవారం తెల్లవారుజామున ఇద్దరు మహిళలు వచ్చి బాబును వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆ మహిళల వివరాలను ఆరా తీయగా.. ఆస్పత్రికి శిశువు తల్లితో పాటు అమ్మమ్మ వచ్చి వదిలేసి కర్నూల్‌కు వెళ్లినట్లు గుర్తించామన్నారు. అయితే వీరిది గద్వాల పట్టణమే ఉండొచ్చని, బాబును వదిలేసి కర్నూల్‌కు వెళ్లుంటారనే అనుమానం వ్యక్తం చేశారు. శిశుడు తల్లి జన్మనిచ్చినప్పటి నుంచి సరిగా పాలు ఇవ్వకపోవడంతో జ్వరంతో పాటు దగ్గు ఉందని చెప్పారు. ఆ బాబు తల్లిని తీసుకొచ్చి ఎందుకు వదిలేసిందో..? కారణాలు తదితర వివరాలపై విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం శిశువు తమ సంరక్షణలో తీసుకున్నట్లు డీడబ్ల్యూఓ 'సాక్షి'కి తెలిపారు.

బ్లాక్‌లో బీర్ల దందా



మరికల్ వైన్ షాపులో పెట్టిన బోర్డు

మరికల్: ఎక్సైజ్ శాఖ అధికారుల నిఘా కొరవడటంతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ దుకాణాల యజమానులు ఎండలను కారణంగా చూపుతు బ్లాక్‌లో అధిక ధరలకు బీర్లు అమ్ముతున్నారు. మండల కేంద్రంలో మూడు మద్యం షాపులు ఉండగా బీర్ల కాటన్లు రాగానే వాటిని వైన్స్ షాపుల ముందున్న దుకాణాలు, దాబాలకు తరలిస్తున్నారు. బీర్ల కోసం వచ్చిన వారికి నోస్టాక్ బీర్లు అంటు స్టిక్కర్ అంటించారు. పక్కనే ఉన్న దుకాణాల్లో అడిగితే ఒక బీరుపై రూ. 50 అధికంగా తీసుకుని ఇస్తున్నారు. ఇదేమిటని అడిగితే వైన్స్ వారే తమ దగ్గర పెట్టి విక్రయిస్తున్నారని, ఇందులో రూ. 20 తమకు, రూ. 30 వైన్స్ వారికి ఇస్తున్నామని చెప్పడంతో మద్యం ప్రియులు ఆశ్చర్యపోతున్నారు. వైన్స్ దుకాణల్లో అమ్మాల్సిన బీర్లు పక్కన దుకాణాల్లో అమ్మడం ఏమిటని ప్రశ్నించిన వారికి వేసవి కారణంగా బీర్ల కొరత ఉందని తాము ఏమి చేయలేమని చెప్పేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణాలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ ఎస్ఐ గురువయ్యను వివరణ కోరగా.. మద్యం దుకాణాల్లో అమ్మాల్సిన బీర్లు చిన్న దుకాణాల్లో, దాబాల్లో అధిక ధరలకు అమ్మిస్తున్న వైన్స్ యాజమాన్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బస్సుటైర్ కిందపడి వ్యక్తికి గాయాలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలో వ్యక్తి బస్సు దిగడంతో ప్రమాదవశాత్తు టైరు కింద కాలు పడి తీవ్ర గాయమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా గొనెగండ్ల మండలం, చిన్నమారిగూడకు చెందిన శంకరయ్యస్వామి అలంపూర్ చౌరస్తాలో బస్సు దిగుతున్న క్రమంలో బస్సు ముందుకు కదిలింది. దీంతో టైర్ కాలుమీదికి ఎక్కింది. కాలు చితికిపోయి రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

రక్తహీనత లోపాలు గుర్తించాలి


జమ్మిచేడు అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

గద్వాల క్రైం/ధరూరు: రక్తహీతన కలిగిన బాలికలను గుర్తించి వారికి వైద్య సదుపాయాలను అందించాల్సిందిగా రాష్ట్ర అనీమియా ముక్త్ భారత్ సభ్యులు సిమ్రాన్, సౌజన్య ఆదేశించారు. బుధవారం గద్వాల, ధరూర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆరు నెలల పసికందు నుంచి 49ఏళ్ల వయస్సు గల వారిలో రక్తహీనత రాకుండా ఐరన్ పోలిక్ మందులు వాడుతున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలు, అవగాహన, నివారణకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందజేయలన్నారు. ఆర్‌బీఎస్‌కే సభ్యులు సెంటర్ల పరిశీలనకు వచ్చిన క్రమంలో రక్తహీనతతో సమస్యలు ఎదుర్కొంటున్న వారి వివరాలను తెలియజేయాలన్నారు. వైద్యులు పరీక్షించి అవసరమయ్యే మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. అంతకు ముందు జిల్లా ఇన్‌చార్జి ఆరోగ్యశాఖ అధికారి శశికళ వారిని పూలబొకేతో ఆహ్వానం పలికారు. ధరూరులో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ, వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బృందం ఇక్కడికి వచ్చినట్లు డా. జ్ఞాని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది స్రవంతి, రాజు, అమూల్య, ఏంజెల్, విజయభాస్కర్, శ్యాంసుందర్, ముక్షుద్, కృష్ణవేణి, శోభారాణి, కవిత, సూపర్‌వైజర్లు నర్సింహులు, హీర్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం, మామిడి చెట్లు దగ్ధం


వీపనగండ్లలో కాలిపోయిన ఆయిల్‌పాం చెట్లు

వీపనగండ్ల: మండల కేంద్రంలో బుధవారం అగ్ని ప్రమాదంలో ఆయిల్‌పాం, మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. మండల కేంద్రానికి చెందిన కానమోని వెంకటయ్యవి 20 ఫామ్‌ఆయిల్ చెట్లతోపాటు డ్రిప్ వైర్లు దగ్ధమయ్యాయి. క్యాతం కురుమయ్య చెందిన 10 మామిడి చెట్లు, గొల్ల ఆశన్నవి 10 మామిడి చెట్లు నిప్పంటుకున్నాయి. రైతుల తోటల సమీపంలో ఉన్న వాగులో జమ్ముకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి తోటలు అంటుకున్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నవజాత శిశువు మృతిపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న అధికారులు

గట్టు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతిపై మదర్ హెల్త్ న్యూట్రీషన్ జాయింట్ డైరెక్టర్ పద్మజ బుధవారం బోయలగూడెంలో విచారణ చేపట్టారు. ఇటీవల గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు కోసం బోయలగూడెం చెందిన సుజాత వెళ్లగా, కాన్పు తర్వాత శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యులతో పాటుగా స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై మదర్ హెల్త్ న్యూట్రిషన్ జాయింట్ డైరెక్టర్ పద్మజ, స్టేట్ డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ అపర్ణ, ప్రోగ్రాం అధికారి స్రవంతి గ్రామంలోని సుజాత ఇంటికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బిడ్డను కోల్పోయినట్లు బాధితులు అధికారులతో వాపోయారు. గట్టు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విచారణ అధికారులు రికార్డులను పరిశీలించారు. వీరి వెంట సీహెచ్ఓ హుస్సేని, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఆయిల్‌పాం తోట దగ్ధం

● రూ.4 లక్షల ఆస్తి నష్టం
● ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు


పాలెం సమీపంలో దగ్ధమైన ఆయిల్‌పాం తోట

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని పాలెం శివారులో ఓ రైతుకు సంబంధించిన ఆయిల్‌పాం తోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. పాలెం గ్రామ శివారులో కుర్మయ్య అనే రైతుకు సంబంధించిన మూడెకరాల పొలంలో 16 నెలల నుంచి ఆయిల్‌పాం తోటను సాగుచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం తోటలో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. తోట పక్కనే ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి తోటకు మంటలు వ్యాపించాయని బాధిత రైతుకు సమాచారం అందజేశాడు. బాధిత రైతు కుర్మయ్య వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకునే సమయానికి తోట 90శాతం పూర్తిగా కాలిపోయింది. మరో రెండేళ్లయితే కాపునకు వచ్చే పంట ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోవడంతో బాధిత రైతు బోరున విలపించాడు. తనకు దాదాపు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

గౌరిదేవిపల్లిలో విషాదం

● హైదరాబాద్‌లో యువకుడు మృతి


చెన్నకేశవులు (ఫైల్)

అడ్డాకుల: మండలంలోని గౌరిదేవిపల్లికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో అనుమానాస్పదంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క నర్సమ్మ, నర్సింహులు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు చుక్క చెన్నకేశవులు(35) హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ ప్రాంతంలో నివాసముంటున్నాడు. సినీ పరిశ్రమలో మేకప్ మెన్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి కరీంనగర్ హైవే వద్ద చెన్నకేశవులు అనుమానాస్పదంగా మృతి చెందాడు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో బంధువులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అయితే చెన్నకేశవులును ఎవరో హత్య చేసినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఈతవనానికి నిప్పు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి గ్రామశివారులో గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుల కుటుంబాలు ఈత చెట్ల ద్వారా కల్లును సేకరించి విక్రయించి జీవనం సాగిస్తున్నారు. బుధవారం వనం వద్ద కార్మికులు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు చెలరేగి దాదాపు 500 ఈతచెట్లు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గౌడ సంఘం నాయకులు రామన్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బస్వరాజుగౌడ్, విష్ణుగౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ చర్యకు పాల్పడిన దుండగులను గుర్తించి వారిపై సరైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.